ప్రజాశక్తి
మంగళవారం 11 జులై 2023
5
అల్లూరి సీతారామరాజు

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు:జిల్లా కలెక్టరు కార్యాలయ పరిధిలో ఈ జిల్లా మేనేజర్ నియామకానికి అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం కాంట్రాక్టు ప్రాతిపదికన జిల్లాకు ఈ- మేనేజర్ పోస్టును కేటాయించిందని, నెలకు రూ.22,500 నిర్దిష్ట వేతనంతో పూర్తి తాత్కాలిక ప్రాతిపదికన మంజూరు చేసిందన్నారు. అర్హతల మేరకు అభ్యర్థిని తాత్కాలిక ప్రాతిపదికన ఎంపిక చేయడం జురుగుతుందని కలక్టర్ తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 11వ తేదీ ఉదయం 10గంటల నుండి 26వ తేదీ సాయత్రం 5గంటల లోపు (కార్యాలయ పని దినములలో మాత్రమే) జిల్లా కలెక్టరు కార్యాలయంలోని తపాలా విభాగం ప్రత్యేక కౌంటర్‌లో స్వయంగా దరఖాస్తులు సమర్పించి తగిన రసీదు పొందాలని లేదా రిజిస్టరు పోస్ట్ ద్వారా ధరఖాస్తులు సమర్పించాలని కోరారు. తుది గడువు తరువాత కార్యాలయమునకు పోస్ట్ లేదా స్వయముగా అందిన దరఖాస్తులు పరిగణించబడవని ఆ ప్రకటనలో తెలిపారు. ఇతర వివరములాకు అల్లూరి సీతారామరాజు జిల్లా అధికారక వెబ్ సైట్ ను సందర్శించాలన్నారు.

కదం తొక్కిన అంగన్వాడీలు

- భారీ నిరసన ప్రదర్శన, మానవహారం
-అనంతరం 36 గంటల ధర్నా ప్రారంభం
-నినాదాలతో దద్దరిల్లిన ఐటిడిఎలు

పాడేరులో ఆందోళన చేపడుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-పాడేరు:తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఏ కేంద్రం వద్ద అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు సోమవారం 36 గంటల మహాధర్నా చేపట్టారు. అల్లూరి జిల్లాలోని పాడేరు, చింతూరు, రంపచోడవరం ఐటీడీఏల పరిధిలో అంగన్వాడీ వర్కర్లు ఈ మహా ధర్నా నిర్వహిస్తున్నారు. పాడేరు ఐటిడిఏకు పెద్ద ఎత్తున తరలివచ్చిన అంగన్వాడీ వర్కర్లు తమ సమస్యలపై నినదిస్తూ ధర్నా చేపట్టారు. గ్రామ గ్రామాల నుంచి అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు వందలాదిగా తరలివచ్చారు. ఐసిడిఎస్ కు బడ్జెట్ పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని అంగన్వాడీలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, అధికారంలోకి రాకముందు జగన్ పాదయాత్రలో అంగన్వాడీల ఓట్లు రాబట్టుకోవడం కోసం అనేక రకమైన హామీలు ఇచ్చారని, ఏ ఒక్కటి నెర వేర్చలేదని విమర్శించారు. మాట తప్పను మడమ తిప్పను అన్న మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అంగన్వాడీలకు కనీస వేతనాలు, గ్రాట్యూటీ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింప చేయాలన్నారు. ఐసిడిఎస్‌కు బడ్జెటును పెంచాలని డిమాండ్ చేశారు. ధరలు పెరిగి పోతున్నా వేతనాలు పెరగక పోవడంతో అంగన్వాడీలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.తక్షణం సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పోతురాజు, భగత్ రామ్, సహాయ కార్యదర్శి కిలో మొస్సాయ, సన్నిబాబు, శంకరరావు, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు మంగమ్మ, గిరిజన సంఘం నాయకులు, అంగన్వాడి జిల్లా నాయకులు కళావతి, కొండమ్మ, వెంకటలక్ష్మి, పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.

చింతూరులో...

రంపచోడవరం :రంపచోడవరం ఏజెన్సీలో అంగన్వాడీలు మండుటెండను సైతం లెక్కచేయకుండా కదం తొక్కారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జాతీయ కమిటీ పిలుపు మేరకు 36 గంటల ధర్నాలో భాగంగా సోమవారం యూనియన్ రంపచోడవరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్మికులు నల్ల చీరలు ధరించి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. మొదట సీఐటీయూ కార్యాలయం నుండి రంపచోడవరం పురవీధుల్లో భారీ ప్రదర్శన నిర్వహించి అంబేద్కర్ జంక్షన్ వద్ద మానవహారం చేపట్టారు. అనంతరం ర్యాలీగా ఐటిడిఎ వద్దకు చేరుకొని అక్కడ 36 గంటల ధర్నాను ప్రారంభించారు. అంగన్వాడీల నినాదాలతో రంపచోడవరం దద్దరిల్లింది. ఈ సందర్భంగా సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చి నాలుగేళ్ల దాటినా 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. తెలంగాణ కంటే అదనంగా వేతనాలు ఇస్తామని చెప్పి జగన్ మాట తప్పారన్నారు. అంగన్వాడీలకు గ్రాడ్యూటీ ఇవ్వాలని సుప్రీం కోర్టు చెప్పినా అమలు చేయలేదన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నిర్మల మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు చేపట్టిన 36 గంటల ధర్నాను చూసైనా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.రామరాజు, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కె.రామలక్ష్మి, కె.రాణి, కె వెంకటలక్ష్మి, నాయకులు రత్నకుమారి, బేబీ రాణి, ప్రసున్న, సింగారమ్మ, నాగదేవి, సిహెచ్.కుమారి, ఏడు మండలాలకు చెందిన అంగన్వాడీలు పాల్గొన్నారు.

పాడేరులో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

చింతూరు : చింతూరు డివిజన్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు స్థానిక ఐటీడీఏ ముందు 36 గంటల ధర్నా చేపట్టారు. దీనిని విఆర్.పురం ఎంపీపీ కారం లక్ష్మి, సిఐటియు జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, కొమరం పెంటయ్య, సున్నం రంగమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్‌కి నిధులు పెంచకుండా నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఉద్యోగ భద్రత, కనీసం వేతనం అమలు చేయాలన్నారు. టిఎ బిల్లు 2017 నుండి ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఈ ధర్నాకు గిరిజన సంఘం నాయకులు సీసం సురేష్, నగేష్, వ్యకాస ఎర్రంశెట్టి శ్రీనివాస్‌రావు, ఐద్వా నేత ముర్రం రంగమ్మ, యుటిఎఫ్ నాయకులు పండా కృష్ణయ్య, కురుసం బ్రహ్మయ్య మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి పోడియం లక్ష్మణ్, నాయకులు బీరబోయిన దిలీప్, ప్రాజెక్టు నాయకులు వెంకటరమణ, కనకదుర్గ, రాజేశ్వరి, సూర్య కుమారి, ముత్తమ్మ, అన్నపూర్ణ, వీరమ్మ, అర్జమ్మద, పార్వతి, జయ, నాలుగు మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు

రంప చోడవరంలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

వినతులు స్వీకరిస్తున్న ఐటిడిఎ పిఒ గనోరే, ఎపిఒ శ్రీనివాసరావు

స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలి

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి- రంపచోడవరం

స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటిడిఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి పిఒ గనోరేతో పాటు ఎపిఒ సిహెచ్.శ్రీనివాసరావు అర్జీలు స్వీకరించారు. మొత్తం 57 దరఖాస్తులు వచ్చాయి. మారేడుమిల్లి మండలం రబ్బర్ రైతులు రబ్బర్ ప్రొసెసింగ్, రబ్బరు ఉత్పత్తులు చేయడానికి కుట్రవాడలో నేచర్ రబ్బర్ ప్రోడక్ట్ కంపెనీని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు అనుమతి మంజూరు చేయాలని కోరారు. రాజవొమ్మంగి మండలం అమీనాబాద్‌లోని ఎంపియుపి స్కూల్లో విద్యార్థులకు సంఖ్యకు అనుగుణంగా మరో ముగ్గురు ఉపాధ్యాయులను నియమించాలని, రంపచోడవరం మండలం చేలకవీధి, రాకోట, కాకివాడ గ్రామాలలో ఏడు పశువుల షెడ్లు నిర్మించారని, పందిరి మామిడి జంక్షన్ నుండి చెవిటి దిబ్బలు మధ్యలో 10 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి ఫారెస్ట్ క్లియరెన్స్ మంజూరు చేసి రోడ్డు పూర్తి చేయాలని వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డిఎస్ శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజ్, కె.సుబ్బయ్య, డాక్టర్ రాధిక, పీహెచ్ఓ కే చిట్టిబాబు, డాక్టర్ ఓబి.ఇందిరా, వెలుగు ఏపిడి ఏ.శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె. సావిత్రి, ఏఎంవో సి.శ్రీహరి. ఎంపీడీవో హరికృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

పెద్ద పులి సంచారం

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరపల్లి మండలం ఇసుక గడ్డ మినీ జలాశయం పరిసర అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు, సిబ్బంది గుర్తించారు. పులి సంచరిస్తున్న ప్రాంతంలో పాదముద్రలను యానిమల్ వారియర్స్ కన్సర్వేషన్ సొసైటీకి చెందిన నిపుణులు బృందం (టైగర్ ఎక్స్పర్ట్) పరిశీలించిన అనంతరం పెద్దపులి సంచరిస్తున్నట్లు వారు నిర్ధారించారు. దేవరాపల్లి -అనంతగిరి మండలాల సరిహద్దుల్లో అటవీ ప్రాంతంలో పెద్దపులి జాడ తెలుసుకోవడం కోసం ట్రాప్ కెమెరాలను అమర్చినట్లు జనపడు రేంజ్ అధికారి వి శ్రీకాంత్ సోమవారం ఒక పత్రిక ప్రకటన ద్వారా వెల్లడించారు. గత మూడు రోజుల నుంచి ఈ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు గిరిజనులు చెప్పడంతో తమ సిబ్బందిని అప్రమత్తం చేశామని అది సంచరించిన ప్రాంతంలో దాని అడుగుజాడలు పరిశీలించిన అనంతరం నిర్ధారించడం జరిగిందన్నారు తెలిపారు. దేవరాపల్లి మండలం బుచ్చింపాలెంతోపాటు వాలాబు పంచాయతీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ ఒక్కరు ఒంటరిగా అడవుల్లోకి వెళ్ళరాదన్నారు. రేవలపాలెం, జీనబాడు అటవీ ప్రాంతం నుంచి ఇసుక గడ్డ రిజర్వాయర్ సమీపంలోని బుచ్చంపాలెం పరిసర ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తున్నట్లు తాము గుర్తించినందున ముందస్తుగా ఈ హెచ్చరిక చేసినట్లు రేంజర్ శ్రీకాంత్ పేర్కొన్నారు.

పట్టుబడిన నిందితులతో పోలీసులు

280కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-పెదబయలు:మండలకేంద్రంలో సీతగుంట పంచాయతీ వారపు సంతలో 280 కేజీల గంజాయి పట్టుబడినట్లు స్థానిక ఎస్ఐ పులి మనోజ్ కుమార్ సోమవారం విలేకర్లకు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సీతగుంట జంక్షన్ వద్ద తమ సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా ముందుగా పల్సర్ బైక్ (ఫైలెట్)గా వెనకాల జీపులో 280 కేజీల గంజాయి రావాణా చేస్తున్నారని తెలిపారు. అనుమానం వచ్చి పల్సర్ బైక్ ఆపడంతో వెనక్కి తిప్పి పారిపోవడానికి ప్రయత్నించారన్నారు.ఇది గమనించిన జీప్ డ్రైవర్ దారి మళ్లించడానికి ప్రయత్నించగా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారని తెలిపారు. నిందితుల్లో ఒకరు మారుమూల మావోయిస్టు ప్రభావిత ప్రాంతం ఇంజారి పంచాయతీ మల్లెపుట్టు గ్రామ వ్యక్తిగా గుర్తించారు. ఒడిసా రాష్ట్రానికి చెందిన ఒంద్రాగెడ్డ గ్రామానికి చెందిన మరోకరిని గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు జి.మాడుగుల సిఐ సత్యనారాయణ, ఎస్ఐ పులి మనోజ్ కుమార్ తెలిపారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

గడప గడపకూ సమస్యలు

ప్రజాశక్తి హుకుంపేట:గడప గడప కార్యక్రమంలో గ్రామ సమస్యలు పట్టవా అని ప్రజలు వాపోతున్నారు. మండలంలోని పట్టం పంచాయతీ గ్రామంలో సోమవారం గడపగడప కార్యక్రమం నిర్వహించారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణతో పాటుగా వైసిపి నేతలు పాల్గొని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అడిగి తెలుసుకున్నారు. బురువాలస, నడుము విధి, అమనగిరి గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గిరిజనులు కోరారు. కోడితల గ్రామంలో రహదారి మరమ్మతుకు నోచుకోక ప్రమాదాలకు నిలయంగా మారిందన్నారు. అధికారులు, నాయకులు గ్రామాలకు వచ్చినప్పుడు సంక్షేమ పథకాలతో పాటు సమస్యలు కూడా తెలుసుకుంటే బాగుండేదని ప్రజలు సూచించారు.

28 నుంచి పోరు యాత్ర

ప్రజాశక్తి -పెదబయలు రూరల్:మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలని ఐద్వా డిమాండ్ చేసింది.సోమవారం ఐద్వా ఆధ్వర్యంలో ఈ నెల 28నుండి ఆగస్టు 9వరకు జరిగే మహిళ పోరు యాత్ర జయప్రదం చేయాలని పెదబయలు వారపు సంతలలో ప్రచారం చేపట్టారు. మహిళలపై జరుగుతున్న హింస, వేధింపులను ప్రజాస్వామ్య వాదులు ఖండించాలని రాష్ట్ర కమిటీ సభ్యులు వి.వి జయ కోరారు. మహిళల సమస్యలపై పోరాటాలకు పోరు నిధి సేకరించారు. . ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామ రాజు జిల్లా అద్యక్షులు బొండా కౌసల్య, జిల్లా కార్యదర్శి హైమవతి పాల్గొన్నారు.

మరోసారి మోసగించే ప్రయత్నం

- పోలవరం నిర్వాసితుల సమస్యలపై స్పష్టత ఇవ్వని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే
- మళ్లీ వరదలొస్తే ఏమి చేస్తారో చెప్పలేదు
- సిపిఎం నేతలు సీతారామయ్య, నాగేశ్వరరావు

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు పాయం సీతారామయ్య

ప్రజాశక్తి-కూనవరం

పోలవరం ముంపు మండలం కూనవరంలో ఆదివారం ఆర్భాటంగా సభ నిర్వహించిన ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి నిండా మునిగిన నిర్వాసితులను మరో సారి మోసం చేసి వెళ్లారని సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు విమర్శించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యలపై ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఎటువంటి స్పష్టత ఇవ్వలేదన్నారు. తమ రాజకీయ మనుగడ కోసం అధికార, ధన, బలాన్ని ఉపయోగించి సుదూర ప్రాంతాలు, ఇతర జిల్లాల నుంచి ప్రజలను తరలించి బల ప్రదర్శన ద్వారా అధిష్టానం మెప్పు పొందటానికి చేసే ప్రయత్నమే అని పేర్కొన్నారు. గత సంవత్సరం వచ్చిన వరదలకు సర్వస్వం కోల్పోయిన నిర్వాసితులకు ఇంతవరకు కనీసం ముఖం చూపని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మళ్లీ వరదలు వస్తే ఎటువంటి ముందు జాగ్రత్తలు చేపడతారో కూడా చెప్పలేదని, అలాంటి వారు ఈ ముంపు ప్రాంత ప్రజలకు ఏమి న్యాయం చేస్తారో ప్రజలు గమనించాలని కోరారు. సిపిఎంపై నిందలు వేస్తే సూర్యునిపై ఉమ్ము వేసినట్లేనని పేర్కొన్నారు. ఈ నాలుగు మండలాల్లో సిపిఎం ఏమి అభివృద్ధి చేసిందో?, రంపచోడవరం ఏడు మండలాలలో వారు ఏమి అభివృద్ధి చేశారో? చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఆ ఏడు మండలాల్లో ఇప్పటికీ రోడ్లు లేని గ్రామాలు ఉన్నాయని, డోలి కట్టుకొని మోసుకెళ్లే పరిస్థితులు, మంచినీరు కూడా దొరక్క ఊటగెడ్డలల నీటిని తాగే ఊళ్ళు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు, ఆవుల మురళి, తలగాని నాగరాజు, షణ్ముఖరావు, బాబు బొర్రయ్య పాల్గొన్నారు.

ముంపు సమస్యలపై స్పష్టతేదీ? : సిపిఐ

కూనవరం : ఎమ్మెల్సీ అనంతబాబు నిర్వహించిన సభలో పోలవరం ముంపు గ్రామాల ప్రజలపై స్పష్టత లేదని, నిర్వాసితుల కష్టాలకు, బాధలకు భరోసా లభించలేదని సిపిఐ నాయకులు దుర్గాప్రసాద్, గుజ్జా మోహన్‌రావు, లంబు శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్షాలను తిట్టడం, అనంతబాబుని పొగడడం కోసమే ఈ సభను ఏర్పాటు చేసినట్లుగా ఉంద, ఈ సభపై ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందని పేర్కొన్నారు. గతంలో సీఎం జగన్ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని, ఒక ఎమ్మెల్సీగా తన పలుకుబడి ఉపయోగించి ఇక్కడ నిర్వాసితులు కోసం ఏమి చేశాడో అనంతబాబు చెప్పాలని డిమాండ్ చేశారు. ఏడాదిగా ఏమి సాధించారని, దేని కోసం జైలుకు వెళ్లారని గజమాలలు సన్మానాలు అని ప్రశ్నించారు.

10 లక్షల జీవో బూటకం : టిడిపి

విఆర్.పురం : రూ.10 లక్షల జీవో బూటకమని, ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు నిర్వాసితులను మరోసారి మోసం చేసే ప్రయత్నం చేశారని జెడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు ఆచంటి శ్రీనివాస్ విమర్శించారు. బురక కన్నారావు అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లాలో ఒక ప్రాజెక్టు వల్ల ముంపులో ఉన్న రెండు గ్రామాల కోసం 350 జీవోను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చి రూ.10 లక్షలు పరిహారం ప్రకటించగా, అది పోలవరం నిర్వాసితుల కోసమని, త్వరలోనే రూ.10 లక్షలు ముంపు ప్రజలకు ఇస్తామని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అబద్ధాలు చెప్పడం సిగ్గు చేటన్నారు. మన్యంలో ఇసుక రాంపులు నడిపే వాళ్ల డబ్బులతో ఈ డ్రామా మీటింగ్ పెడుతున్నారని ఎద్దేవా చేశారు. 'మీకు భజన చేసే లోకల్ నాయకులు ఫొటోలు ఎక్కడా పెట్టారా? మీ ఫొటో పక్కన మీ కింద నాయకులు ఫొటోలు పెడితే అవమానంగా భావించే నువ్వు ఇక్కడి నిర్వాసితులకు ఏ న్యాయం చేస్తావు అని అనంతబాబును ఉద్దేశించి ప్రశ్నించారు. సమావేశంలో మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, ఎంపీటీసీ వాళ్ల వెంకటేశ్వర రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు ఎండి.రహీం, టిడిపి నాయకులు బీరక సూర్య ప్రకాష్‌రావు, ముత్యాల రమేష్, రేపు సింహాచలం, వడ్డాణపు సత్యనారాయణ, పెట్ట శివ పాల్గొన్నారు.

ఎందుకోసం బహిరంగ సభ పెట్టారు?

రంపచోడవరం : ఎమ్మెల్సీ అనంతబాబు కూనవరంలో ఎందు కోసం బహిరంగ సభ పెట్టారో చెప్పాలని టిడిపి మండల అధ్యక్షులు కారం సురేష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం గురించి మాట్లాడారా? నియోజకవర్గ అభివృద్ధి గురించి మాట్లాడారా? భారీగా గిరిజన ప్రాంతానికి ఎమ్మెల్యే నిధులు తీసుకొచ్చారా? ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ద్వారా అభివృద్ధి చేసినందుకా? ఎందుకు ఈ బహిరంగ సభ అని ప్రశ్నించారు. తన మాజీ కారు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన కేసులో జైలుకెళ్లిన ఎమ్మెల్సీ అనంతబాబును వైసిపి నుండి సస్పెండ్ చేశామని మాయమాటలు చెబుతూ డ్రామాలు ఆడుతుందని పేర్కొన్నారు. కూనవరం బహిరంగ సభ జరగడానికి పోలీస్ అధికారులే కీలక పాత్ర పోషించారని, దానికి వైసీపీ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరిపై బురద జల్లడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు పెంటపాటి అనంత మోహన్, కారం సింహాచలం, వైవి నిరంజన్ దేవి, కారం శేషయ్యమ్మ, సిద్ధ వెంకన్న, కొంచెం బాపన్న దొర, దిండి జనార్ధన్, వెంకటలక్ష్మి, లక్ష్మి, చక్రపాణి, వెంకట్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విఆర్.పురం టిడిపి నాయకులు

ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న ఎంపిటిసి ప్రదీప్‌కుమార్, సర్పంచ్ లక్ష్మి తదితరులు

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-విఆర్.పురం

ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పెద్దమట్టపల్లి సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్ అన్నారు. మండలంలోని. పెద్దమట్టపల్లి సచివాలయంలో తహశీల్దార్ ఎన్.శ్రీధర్, ఎంపిడిఒ ఎం.రత్నకుమారి, సెక్రటరీ స్వరూపరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష గ్రామ సభలో సర్పంచ్, ఎంపిటిసి మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా జనన, మరణ, కుల, ఆదాయ, కుటుంబ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కు అనుసంధానం, సిసిఆర్‌సి కార్డులు వంటి 11 రకాల సేవలు ఎటువంటి రుసుం లేకుండా ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ ప్రదీప్ కుమార్, తహశీల్దార్ ఎన్.శ్రీధర్, ఎంపిడిఒ ఎం.రత్నకుమారి చేతులమీదుగా ధ్రువీకరణ పత్రాలతు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసీపీ నాయకులు, చిక్కాలబాలు, ముత్యాల శ్రీను గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అస్వస్థత

ప్రజాశక్తి-అనంతగిరి

8 మంది విద్యార్థినిలు పైగానే అస్వస్థతకు గురైన ఘటన మండలంలోని కొత్తూరు కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో నెలకొంది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీరంతా వింతగా ప్రవర్తించడంతో తోటి విద్యార్థినిలు భయాందోళనకు గురవుతున్నారు. శనివారం, ఆదివారం, సోమవారం వరుసగా మూడు రోజులు రాత్రి, పగలు తేడా లేకుండా విద్యార్థినిలు భయబ్రాంతులకు గురవుతుండటంతో తోటి విద్యార్థులు భయాందోళనకు గురవుతూ ఇంటి బాట పట్టవలసిన పరిస్థితి నెలకొంది. అస్వస్థతకు గురైన విద్యార్థినిలకు ప్రథమ చికిత్స నిమిత్తం విజయనగరం జిల్లా ఎస్.కోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు

పాత్రికేయులకు బస్ పాసులు అందజేత

ప్రజాశక్తి-పాడేరు

జిల్లాలో అక్రిడిటేషన్లు పొందిన పాత్రికేయులకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బస్ పాస్ లను పంపిణీ చేసారు. సోమవారం అక్రిడిటేషన్లు. పొందిన ప్రింటు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ఆర్టిసి అధికారులు బస్ పాస్ లను జారీ చేసారు. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పలువురు పాత్రికేయులకు బస్ పాస్ లు అందజేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 13వ తేదీలోపు బస్ పాసులు పొందాలని ఆర్‌టిసి. డిఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ పి. గోవిందరాజులు, ఆర్టిసి డిఎం వి.శ్రీనివాసు. ఆర్ టిసి సిబ్బంది ప్రసాద్, పలువురు పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన గృహ నిర్మాణాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని గృహ నిర్మాణ శాఖ జిల్లా అధికారిణి రమామణి సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నక్కపల్లి, పాయకరావుపేట మండలాలకు చెందిన హౌసింగ్ అసిస్టెంట్లతో గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా జగనన్న కాలనీలపై ఆరా తీశారు. లబ్ధిదారులతో ఎప్పటి కప్పుడు మాట్లాడి త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా చూడాలని ఆదేశించారు. సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని, బిల్లులు మంజూరు, సామగ్రి పంపిణీల్లో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈనెలాఖరు నాటికి అనకాపల్లి జిల్లాలో 15వేల వరకూ జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు పూర్తవుతాయని, ఇప్పటికే 13,453 పూర్తయ్యాయని రమామణి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 58,084 గృహాలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, 11,452 గృహాలకు సంబంధించి పునాదులు పూర్తయ్యాయని, 23,723 బేస్మెంట్, 2,927 శ్లాబ్ స్థాయి, 1657 గృహాలకు సంబంధించి శ్లాబులు పూర్తయ్యాయని తెలిపారు. ఈ సమావేశంలో హెడ్ క్వార్టర్ డీఈ పీవీఎస్ఎన్ఆర్ ప్రసాద్, స్థానిక డీఈ విజేయుడు, ఏఈ డీపే రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-నక్కపల్లి: రైతాంగం సమస్యలను పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రైతాంగ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ మండలంలోని దోసలపాడు, చందనాడ గ్రామ సచివాలయాల్లో కార్యదర్శిలకు సోమవారం వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు ఎం.రాజేష్, రైతు సంఘం గ్రామ అధ్యక్షులు వెంకన్న, ఖండిపల్లి సత్యనారాయణ, గట్టెం సత్తిబాబు పాల్గొన్నారు .

వరి నారు మడుల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి: ఆరోగ్యవంతమైన వరి నారుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని, అందుకు అనుగుణంగా రైతులు వరి నారుమడులను సిద్ధం చేసుకోవాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ సూచించారు. మండలంలోని డొంకాడ, గొడిచెర్ల, దేవవరం గ్రామాల్లో సోమవారం సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వరి నారు మడులను పరిశీలించారు. నారుమడిని పది రోజుల వ్యవధిలో 2,3 సార్లు దమ్ము చేసి చదును చేయాలన్నారు. ఐదు సెంట్లు నారుమడికి 2 కేజీల నత్రజని, కేజి భాస్వరం, పొటాష్‌ను దుక్కిలో వేసుకోవాలని సూచించారు. తర్వాత విత్తన శుద్ధి చేసి మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకి 5 కేజీల చొప్పున జల్లుకోవాలన్నారు. జింక్ లోపాన్ని గమనిస్తే లీటర్ నీటికి 2 గ్రాముల సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలని, వరి నారు మడులు ఎండి పోకుండా తగినంత నీటిని ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సత్యన్నారాయణ, రైతులు పాల్గొన్నారు.

ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని మత్స్యకార గ్రామాలైన రాజయ్యపేట, బోయపాడు సముద్ర తీర ప్రాంతంలో ఫిష్ లాండింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని మత్స్యకారులు కోరారు. సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని స్పందనలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో మత్స్యకారులు సముద్రాన్ని నమ్ముకుని వేట చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఫిష్ ల్యాండింగ్ సెంటర్ లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఫిష్ ల్యాండింగ్ సెంటర్ మంజూరు చేసిందని, నేటి వరకు ఏర్పాటు చేయలేదన్నారు. ఇప్పటికే అనేకసార్లు అధికారులు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటుకు భూములు పరిశీలించారన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు గోసల సోమేశ్వరరావు, పిక్కి కాశీ, ఏరిపల్లి నాగేష్, పిక్కి కాశీ, చేపల సోమేష్, బొంది నూకరాజు, పిక్కి నూకరాజు, పిక్కి అప్పలరాజు, కారే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి- కోటవురట్ల: పాఠశాల, రోడ్డు నిర్మాణం చేపట్టాలని గొట్టువాడ శివారు అణుకు గిరిజనులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 4వ రోజుకు చేరుకున్నాయి. తమ గ్రామానికి రహదారి, పాఠశాల భవనం ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు, సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గిరిజన మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డేవిడ్‌రాజు మాట్లాడుతూ, గిరిజన గ్రామమైన అణుకు గ్రామానికి కనీస మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. రహదారి నిర్మాణాలకు స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన మహిళలు పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన దళితులకు ఇళ్లు ఇవ్వాలి

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పేద, దళిత రైతులు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్ళపాలెం గ్రామాల్లో భూములు కోల్పోయిన పేదలందరికీ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, డి.అప్పలరాజు మాట్లాడుతూ, జివిఎంసి 6వ వార్డు పరిధి కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్ళపాలెం గ్రామాల్లోని పేద, దళిత రైతులకు 1978లో ఇందిరా గాంధీ ప్రభుత్వం కుటుంబానికి ఎకరం చొప్పున 80 కుటుంబాలకు వ్యవసాయ భూములు కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వం రైతులకు తెలియకుండానే వారి భూములను నవోదయ స్కూలు, వికలాంగుల ఐటిఐ, పట్టుపురుగుల పరిశ్రమ, పోలీస్ శిక్షణా కేంద్రం వంటి నిర్మాణాలకు తీసుకుందన్నారు. ఈ మధ్య కాలంలో జూనియర్ కాలేజీ నిర్మాణం చేపట్టినప్పుడు ఆ గ్రామాల రైతులందరూ ఆ ప్రాంతానికి చేరుకొని తమ భూములకు ప్రత్యామ్నాయం చూపాలని ఆందోళన చేశారని తెలిపారు. అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు, భూములకు ప్రత్యామ్నాయంగా హుదూద్ సందర్భంగా ఇళ్ళు కొల్పోయిన వారికి "సినిమా ఇండ్రస్టీ"వారు నిర్మిస్తున్న ఇళ్లల్లో వారికి కేటాయిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఇంతవరకు హామీ నెరవేరలేదన్నారు. బాధితులందరూ హైకోర్టు ఆశ్రయించగా, వీరందరికీ ఇళ్లు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసినా అమలు చేయలేదన్నారు. గత సంవత్సరం హౌసింగ్ పీడీ ఆఫీస్ వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలపగా వారంలో రోజుల్లో విచారణ జరిపి ఇళ్లు కేటాయిస్తామని హౌసింగ్ అధికారులు హామీ ఇచ్చి ఏడాది గడిచినా, ఇంతవరకూ కేటాయించలేదన్నారు. రెవెన్యూ అధికారులు ఆ గ్రామాల్లో పర్యటించి బాధితుల జాబితాను తయారుచేసినా ఇంతవరకు ఇళ్ళు కేటాయించకపోవడం దుర్మార్గం అన్నారు. ఈ మేరకు స్పందనలో కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ ధర్నాలో సియ్యాద్రి పైడితల్లి, అప్పలరాజు, వెంకయ్యమ్మ, బంగారమ్మ, నరసయమ్మ, దేవుడు, అప్పారావు పాల్గొన్నారు.

200 రోజుల 'ఉపాధి' కల్పించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: ఉపాధి కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించి, రోజు కూలీ రూ.600లు చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. మండలంలోని దోసలపాడులో సోమవారం ఉపాధి కూలీలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, వ్యవసాయ పనులు లేక కూలీలు ఉపాధి హామీ పనులపైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. చాలా కుటుంబాల్లో 100 రోజులు పని పూర్తి చేసి ఉన్నారని, పనులు లేక పస్తులతో జీవించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీల స్థితిగతులు పరిగణనలోకి తీసుకుని 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలతో పేదలు ఎలా జీవించాలని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండలం కార్యదర్శి ఎం.రాజేష్, జుత్తుక అప్పారావు, కొల్లి దేవుళ్ళు, పక్కుర్తి రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకు సేవలు : ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి -నక్కపల్లి: ప్రజల ముంగిటకు ప్రభుత్వం సేవలు అందిస్తుందని ఎమ్మెల్యే గొల్ల బాబురావు అన్నారు. మండలంలోని డొంకాడ, చిన్నతీనార్ల గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే బాబురావు మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పొందేందుకు అర్హులై ఉండి తప్పిపోయి ఉంటే అటువంటి వారిని సర్వేలో గుర్తించి వారికి లబ్ధి చేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు నానాజీ, ఈశ్వరరావు, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు కొప్పిశెట్టి హరిబాబు, వైసిపి నాయకులు శీరం నరసింహమూర్తి, ఈ ఓ పి ఆర్‌డి వెంకటనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అధికారులు పాల్గొన్నారు .

వాలంటీర్‌ను తొలగించలేదని పార్టీకి దూరం

ప్రజాశక్తి-గొలుగొండ: వాలంటీర్‌ను విధుల నుంచి తొలగించలేదనే కారణంగానే వరహాలబాబు పార్టీని విడాడని నాగాపురం సర్పంచ్ యలమంచిలి రఘురాం, గ్రామ పార్టీ అధ్యక్షులు వాసం లోవనారాయణ అన్నారు. పార్టీలో ప్రాధాన్యత లేనందునే వైసిపిని వీడుతున్నానని వరహాలు బాబు చేసిన అభియోగానికి సోమవారం వైసిపి నాయకులు విలేకరులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీకి సంబంధించిన కార్యక్రమాల్లో గ్రామంలో అందరికీ ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పార్టీకి సంబంధించిన కార్యక్రమాల్లో వరహాలు బాబే ముఖ్య భూమిక పోషించేవాడన్నారు. ఒక మహిళా వాలంటీరును విధుల నుంచి తొలగించమని అతను తమని కోరాడన్నారు. బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించే వాలంటీర్‌ను తాము తొలగించడానికి అంగీకరించ లేదని, అందుకోసమే అతను పార్టీని విడిచి వెళ్లిపోయాడని వారు తెలిపారు. గ్రామంలో ఒక వ్యక్తి వెళ్లిపోయినంత మాత్రాన వైసిపి పార్టీకి ఏ విధమైన నష్టం ఉండదని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాసిలి బాలసుబ్రమణ్యం, స్కూల్ కమిటీ చైర్మన్ లోవరాజు, వాలంటీర్ బుజ్జి, పార్టీ కార్యకర్త లు అప్పన్న దివాణం తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల భారీ వర్షం

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో సోమవారం సాయంత్రం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎండ తీవ్రతతో అల్లాడిన ప్రజలు ఒకసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని వర్షం కురిసింది. ఈ వర్షానికి ఇటీవల రైతులు వేసుకున్న వరి నారుమడులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కురిసిన వర్షానికి ప్రధానంగా మండల కేంద్రంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రధానంగా మండల పరిషత్తు కార్యాలయం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద రోడ్లపై నీరు ప్రవహిస్తురడంటతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

గొలుగొండ: మండలంలో సోమవారం కుండపోత వర్షం కురిసింది. చిన్నపాటి జల్లులతో ప్రారంభమైన వర్షం భారీ వర్షంగా మారింది. మండలంలో కృష్ణదేవిపేట, ఏఎల్ పురం, లింగంపేట, కొత్తమల్లంపేట, ఆరిలోవ అటవీ ప్రాంతం, గొలుగొండ, జోగుంపేట తదితర ప్రాంతాల్లో వర్షం అధికంగా కురిసింది. భానుడి ప్రతాపంతో అల్లాడిన ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. వరి విత్తనాలు వేసి వర్షాల కోసం ఆశతో ఎదురు చూస్తున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : నగర పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్యంగా ఉంటారని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. సోమవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 18వ వార్డు పరిధిలోని ఎంవిపి. డబల్ రోడ్డు, సమతా కాలేజీ తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎంవిపి.డబల్ రోడ్డులో పారిశుధ్యం నిర్వహణ సరిగా జరగడం లేదని, సమతా కాలేజీ వద్ద డస్ట్ బిన్ నిండి దాని చుట్టూ చెత్త పేరుకుపోవడంపై వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్తను వెంటనే తొలగించి ఆ ఫొటోలను వాట్సాప్‌లో పంపించాలని ఆదేశించారు. రోజూ చెత్త తరలించే వాహనాలు వస్తున్నా చెత్త ఎందుకు ఉందని ఆరా తీశారు. ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

17వ వార్డులో జగనన్న సురక్ష

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసి 17వ వార్డులో అక్కరమాని విజయనిర్మల ఆధ్వర్యాన జగనన్న సురక్ష కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సంక్షేమ పథకాలకు అర్హత సాధించేందుకు సర్టిఫికెట్ల అవసరమని, వాటి కోసం ప్రత్యేకంగా జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటుచేసి సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వార్డులో 900 మందికి సర్టిఫికెట్లు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కార్పొరేటర్ గేదల లావణ్య నాగరాజు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు

పెన్షన్ విడుదల చేయాలి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : తమ పెన్షన్లను వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జిల్లా గ్రంథాలయాల సంస్థ పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.మల్లేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరుతూ సోమవారం బహిరంగ లేఖ రాశారు. ఉమ్మడి 13 జిల్లాలలో యున్న జిల్లా గ్రంథాలయ సంస్థలో 1200 మంది పెన్షనర్లకు జూన్ నెల పెన్షన్లు నేటికీ జమ కాలేదని తెలిపారు. అనారోగ్యంతో వైద్య చికిత్స, మందుల కొనుగోళు, దైనందిన కుటుంబ ఖర్చులకు పలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శికి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్‌కు, డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్, అకౌంట్స్‌కు, సిఎఫ్ఎంఎస్‌కు ఈ మెయిల్ ద్వారా ఈ నెల 6వ తేదీన లేఖ పంపినట్లు తెలిపారు. నిధుల లభ్యత ఉన్నప్పటికీ పెన్షనర్లకు నేటికీ పెన్షన్లు చెల్లించలేదని ఆవేదన వ్యక్తంచేశారు.

ఫిషింగ్ హార్బర్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ఫిషింగ్ హార్బర్‌లోని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్, అధ్యక్షుడు కూడా వజ్రం విజ్ఞప్తి చేశారు. ఫిషింగ్ హార్బర్‌కు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.152 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపైన, ఫిషింగ్ హార్బర్‌లోని కార్మికులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపై సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వాల విధానాల వల్ల హార్బర్‌లో పనిచేస్తున్న మత్స్యకారుల జీవితాలు ప్రస్తుతం దుర్భరమైన పరిస్థితుల్లోకి నెట్టివేయబడుతున్నాయన్నారు. సముద్రంలో చేపల వేట సమయంలో మరణించిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా రూ.20 లక్షలకు పెంచాలని, వేటకు వెళ్లి వచ్చిన తర్వాత వారికి విశ్రాంతి కోసం ఒక సామాజిక భవనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు చీకట గురుమూర్తి, నాగభూషణం పాల్గొన్నారు.

సిస్టమ్ మోడలింగ్‌పై గీతంలో ఇఇసిఇ సదస్సు

ప్రజాశక్తి- మధురవాడ : సిస్టమ్ మోడలింగ్, కంట్రోలర్ డిజైనింగ్‌పై అధ్యాపకులకు, పరిశోధకులకు అవగాహన కల్పించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. ఎన్ఐటి రాయపూర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుభజిత్ ఘోష్ ముఖ్యఅతిథిగా హజరై విఎల్ఎస్ఐ డిజైన్, సిగ్నల్ ప్రాసెసింగ్, కంట్రోల్ సిస్టమ్స్‌పై అవగాహన కల్పించారు. ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ సి.విజయశేఖర్ మాట్లాడుతూ కంట్రోల్ సిస్టమ్స్‌లో పరిశోధనలకు గల అవకాశాలను వివరించారు. ఇఇసిఇ విభాగం అధిపతి ప్రొఫెసర్ జె.బి.సెవెన్త్‌లైన్, కార్యక్రమ కోఆర్డినేటర్‌లు డాక్టర్ పి.నరేష్, ఎమ్.రాము మాట్లాడారు.

వేతన బకాయి చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి -ములగాడ : బ్రిడ్జి అండ్ రూప్ కార్మికుల వేతన బకాయికు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం హెచ్‌పిసిఎల్ గేటు వద్ద ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు బొగవిల్లి నాగభూషణం, మంత్రి.రాజశేఖర్ మాట్లాడుతూ, హెచ్‌పిసిఎల్ విస్తరణ తర్వాత ఉత్పత్తి పెరిగినా, కార్మికులకు సక్రమంగా వేతనాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. బ్రిడ్జ్ అండ్ రూఫ్ కంపెనీలో పశ్చిమబెంగాల్, జార్ఖండ్, ఒడిశా, బీహార్ తదితర రాష్ట్రాలకు చెందిన మూడు వందల మంది అసంఘటిత కార్మికులు పనిచేస్తున్నారని, వారికి ఏడాదిగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు.ఆందోళన తర్వాత యాజమాన్యంతో చర్చలు జరపగా,ఈ నెల 14న మేనెల, జూన్ నెలలో సగం జీతాన్ని చెల్లిస్తామని, మిగిలిన వేతనాన్ని ఈ నెల 20న చెల్లిస్తామని హామీ ఇచ్చారని కార్మికసంఘం నేతలు వెల్లడించారు. దీంతో ఆందోళన విరమించారు.

స్థానికులకే ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలి

ప్రజాశక్తి-పద్మనాభం : సమస్యలు పరిష్కారం కావాలన్నా, అభివృద్ధి జరగాలన్నా రానున్న ఎన్నికల్లో స్థానికులకే ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలని పద్మనాభం మండల వెలమ సంఘం నేతలు కోరారు. సోమవారం రెండవ విజయరామరాజు జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, పలు పార్టీలు ప్రజా సేవ చేసే వారికంటే, స్వార్థపరులకు పార్టీ టిక్కెట్లు ఇవ్వడం వల్ల నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. స్థానికేతరుడైన ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా అనుసరిస్తున్న విధానాలు, ఒంటెద్దు పోకడలు అందరికి తెలిసినవేనన్నారు. రానున్న ఎన్నికల్లో ఈ ప్రాంతీయులకు అందుబాటులో ఉండే స్థానికుడికే ఎమ్మెల్యే టిక్కెట్‌ను రాజకీయ పార్టీలు కేటాయించాలని కోరారు. సమావేశంలో మాదిరెడ్డి భాస్కరరావు, ఎల్ వెంకటరావు, రొంగలి సూర్యనారాయణ, లోకవరపు చంద్రరావు పాల్గొన్నారు.

భద్రతా విభాగాధిపతిని కలిసిన ఇంటక్ నేతలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన డి.రామ్‌ప్రసాద్‌తో ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ నేతృత్వంలో నాయకులు సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విభాగాధిపతి మాట్లాడుతూ ప్లాంట్, కార్మికుల భద్రతకు విశేష చర్యలు తీసుకున్నామన్నారు. ప్లాంట్ ప్రగతికి ప్రతిఒక్కరూ సహకారం అందించాలని, ప్రమాద రహితప్లాంట్‌గా మార్చే దిశగా ముదుకు సాగాలన్నారు. ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ కార్మికుల భద్రతపై పలు విషయాలను చర్చించి, సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, నాయకులు కారు రమణ, కొవిరి అవతారం, బిఎంకె.నాయక్, ఎస్ఏ.నాయుడు, ఎస్ఎస్.రెడ్డి మంత్రి గోపినారాయణ, గోపిశెట్టి వెంకటరావు, మహాలక్ష్మినాయుడు, బి.వరహాలబాబు, గంగవరం గోపి, డి.సాహూ, సత్యారావు, ఎంఎస్ఆర్.ప్రసాద్, మొల్లి ఈశ్వరరావు మింది దేముడు, రమేష్‌కుమార్, పల్లం గోపి, మొల్లి అప్పారావు, జి.స్వామినాథం పాల్గొన్నారు

12 నుంచి సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఈనెల 12 నుంచి 15 వ తేదీ వరకు సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు జరుగనున్నాయని స్థానిక ప్రభుత్వ డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు

విశాఖ ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ డైట్ కళాశాలల్లో 2015-17 నుంచి 2018- 20 వరకు డిఇఎల్ఇడి కోర్సు చదివి, మొదటి ఏడాది ఫైనల్ లెసన్ టీచింగ్ ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరు కాని వారికి, ఫెయిలైన విద్యార్థులకు ఇపుడు సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అలానే 2021-23 రెగ్యులర్ విద్యార్థులు, రెండవ సెమిస్టర్ ఫైనల్ లెసన్ టీచింగ్ ప్రాక్టికల్స్ కూడా అదే తేదీల్లో జరుగుతాయని తెలిపారు

గంగవరం పోర్టు కార్మికుల వినూత్న నిరసన

ఏడో రోజు నిరవధిక దీక్షల్లో అర్ధనగ్న ప్రదర్శన

దీక్షల్లో అర్ధనగ్న ప్రదర్శనతో ఆందోళన చేస్తున్న నిర్వాసిత కార్మికులు

ప్రజాశక్తి -గాజువాక : ఆదానీ గంగవరం పోర్టు దరి గాంధీ విగ్రహం జంక్షన్ వద్ద కార్మికులు చేపడుతున్న నిరవధిక నిరసన దీక్షలు సోమవారం ఏడో రోజుకు చేరుకున్నారు. దీక్షాశిబిరంలో కార్మికులు అర్ధనగ్నంగా వినూత్న నిరసన తెలిపారు.దీక్షా శిబిరాన్ని సందర్శించిన తెలుగుదేశం జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, కలెక్టర్ చెబుతున్నా వినకుండా, కార్మికుల పట్ల పోర్టు యాజమాన్యం మొండివైఖరి ప్రదర్శిస్తోందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కలుగజేసుకొని యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి నిర్వాసిత కార్మికులకు వేతన సమస్య పరిష్కరించాలని కోరారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, కనీస వేతనం రూ.36వేలకు పెంచాలని కోరారు. లేకుంటే జరిగే పరిణామాలకు యాజమాన్యం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. గంగవరం పోర్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధానకార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ, ఉద్యమాన్ని చీల్చేందుకు పోర్టు యాజమాన్యం అడ్డదారులు తొక్కుతోందని, దిబ్బపాలెం, శ్రీనగర్ నుంచి ఇద్దరు కార్మికులను విధులకు హాజరయ్యేలా చేసిందన్నారు.పోర్టు యాజమాన్యం కుయుక్తులు, నిర్లక్ష్య వైఖరికి నిరసనగా . మంగళవారం ఉదయం 10 గంటలన ండి పాత గాజువాక జంక్షన్‌లోకార్మికులంతా భిక్షాటనతో నిరసన చేస్తారన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ పాండే, స్టీల్ ప్లాంట్ పోరాట కమిటీ చైర్మన్ ఓబులేసు, స్టీల్ ప్లాంట్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, సిఐటియు స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి కోవిరి అప్పలరాజు స్టీల్ ప్లాంట్ డివిఆర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డివి రమణ పాల్గొని కార్మికుల పోరాటానికి సంఘీభావాన్ని ప్రకటించారు.కార్యక్రమంలో వాసుపిల్లి ఎల్లాజీ, గంటిపిల్లి అమ్మోరు, మాద అప్పారావు, కదిరి సత్యానందం, పేర్ల నూకరాజు, గంటిపిల్లి లక్ష్మయ్య, నొల్లి స్వామి, కొవిరి అమ్మోరు పాల్గొన్నారు.

యూనియన్ పెడితే విధుల్లోంచి తొలగిస్తారా?

గోపాలపట్నం : ఆదానీ గంగవరం పోర్ట్‌లో యూనియన్ పెట్టారని తొలగించిన అధ్యక్ష కార్యదర్శులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు గోపాలపట్నం డివిజన్ కమిటీ ఉపాధ్యక్షుడు బలివాడ వెంకటరావు డిమాండ్ చేశారు. పోర్టు యాజమాన్యం నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సోమవారం గోపాలపట్నం ప్రధాన రహదారిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ యూనియన్ పెడితే పనిలోంచి పీకేస్తారాయని పోర్టు యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ప్రైవేటు సంస్థల్లో కార్మిక హక్కులకు రక్షణ లేకుండా పోయిందని ఆక్షేపించారు.కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్. నర్సింగరావు, ఆర్. నగేష్ పాల్గొన్నారు

కార్పొరేట్లకు ప్రభుత్వరంగం ధారదత్తం

ఎఐటియుసి జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా

ప్రజాశక్తి-ఉక్కునగరం : కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రభుత్వరంగాన్ని కార్పొరేట్లకు దోచిపెడుతోందనిఎఐటియుసి జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా విమర్శించారు. సోవారం ఉక్కు నగరం ఆంధ్ర కేసరి కళాక్షేత్రంలో ఎఐటియుసి రాష్ట్రస్థాయి యువకార్యకర్తల రెండు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య పెరగడానికి ప్రధాన కారణం నరేంద్ర మోదీ ప్రభుత్వమేనన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేని ప్రభుత్వానికి పాలించే నైతిక హక్కు లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకులు, బీమా కంపెనీలు, జాతీయ రహదారులను కార్పొరేట్లకు చౌకగా కేంద్ర ప్రభుత్వం అమ్మేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డబుల్ ఇంజన్‌గా వ్యవహరిస్తుందని, ల్యాండ్, ఇసుక, లిక్కర్, చిట్ ఫండ్ మాఫియాలకు నెలవుగా మారిందన్నారు. రాష్ట్రంలోని ఎఐటియూసి కార్యకర్తలు సమరశీల పోరాటాలకు సిద్దంగా ఉండాలని పిలుపునిచ్చారు.యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్. రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, స్టీల్ అధ్యక్షులు కెఎస్ఎన్ రావు , అదనపు ప్రధాన కార్యదర్శి జె. రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, కోశాధికారి కొండలరావు పాల్గొన్నారు .శిక్షణా తరగతుల సందర్భంగా తొలుతయూనియన్ జెండాను జాతీయ కార్యదర్శి రామకృష్ణ ఆవిష్కరించారు.

కనీస పెన్షన్ సాధనకు మరో పోరాటం

సమావేశంలో మాట్లాడుతున్న నూకరాజు

ప్రజాశక్తి -ములగాడ: నెలసరి కనీస పెన్షన్ రూ.9వేలు, ఇతర సమస్యల పరిష్కారానికి ఇపిఎఫ్ -95 పెన్షనర్లంతా మరోపోరాటానికి సిద్ధం కావాలని పారిశ్రామిక ప్రాంతం పెన్షనర్ సంఘం నేతలు కోరారు. సోమవారం మల్కాపురం జోన్ సిఐటియు కార్యాలయంలో సిహెచ్. తమ్మారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సంఘం అధక్షులు కె.నూకరాజు మాట్లాడుతూ పెన్షనర్ల డిమాండ్ల సాధనకు దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా ఎంపిలకు మెమోరాండం, ప్రధానికి పోస్టుకార్డు ఉద్యమంలో పాల్గొని జయప్రదం చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కె హుస్సేన్ మాట్లాడుతూ, పోస్టుకార్డు ఉద్యమంలో జిల్లా నుంచి రెండు వేల మందికిపైగా పాల్గొనడం అభినందనీయ మన్నారు. కోర్టు తీర్పు వల్ల ఈ ఏడాది సెప్టెంబర్ ఒకటికి ముందు ఉద్యోగ విరమణ చేసేవారంతా హయ్యర్ పెన్షన్ పొందే అవకాశం లేదని అసిస్టెంట్ పిఎఫ్ ఆఫీసర్ వీడియో సందేశం పంపారని వివరించారు. ఆర్‌టిసి ఉద్యోగికి రూ.2,500 పెన్షన్ వస్తుందన్న దుష్ప్రచారాన్ని జాతీయ ఉద్యమ కమిటీ ఖండించిందన్నారు.

కేసుల పరిష్కారంలో విశాఖ టాప్!

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : కేసుల పరిష్కారంలోఉమ్మడి విశాఖపట్నం జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఉందనిఎపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్ అన్నారు. సోమవారం జిల్లా న్యాయవాదుల సంఘాన్ని అభినందించారు. జిల్లా న్యాయవాదుల సంఘం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ న్యాయమూర్తులు, న్యాయవాదులు న్యాయానికి, న్యాయవ్యవస్థకు రెండు చక్రాలు లాంటివారని, అవి సజావుగా నడిస్తేనే, సమాజంలో న్యాయవ్యవస్థకు గౌరవం వస్తుందని అభిప్రాయపడ్డారు. విశాఖపట్నంలో నిర్మితమవుతున్న కోర్టు కాంప్లెక్స్‌ను అతి త్వరలో ప్రారంభించడానికి అన్ని విధాలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విశాఖపట్నం జిల్లా ప్రధానన్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చింతపల్లి రాంబాబు, ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, బార్ కౌన్సిల్ మెంబర్లు ఎస్ కృష్ణమోహన్, పి.నర్సింగరావు, కోశాధికారి చిగురుపల్లి భాస్కరరావు. పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం జస్టిస్ దుర్గాప్రసాదును న్యాయవాదుల సంఘం సత్కరించింది.

అపోలోలో వృద్ధుడికి అరుదైన ఆపరేషన్

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ హెల్త్‌సిటీ అపోలో ఆసుపత్రిలో 75 ఏళ్ళ వృద్ధుడికి అపోలో కార్డియాలజీ బృందం అరుదైన ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించింది.వేపగుంటకు చెందిన వృద్ధుడు మధుమేహం, హైపర్ టెన్షన్, పోస్ట్‌యాంజియోప్లాస్టీతో తీవ్రమైన శ్వాసలోప సమస్యతో బాధపడుతూ అపోలో ఆసుపత్రిలో చేరారు. గుండె కవాటానికి వెళ్లే నాళాలు మూడుకు బదులు రెండే ఉండడాన్ని గుర్తించిన వైద్యులు, రోగిని నార్మల్ కండిషన్‌కి తీసుకు వచ్చి, బంధువులతో చర్చించి రోగికి ద్విపత్ర బృహద్ధమని కవాటంలో ట్రాన్స్ కాథెటర్ కవాట ప్రత్యామ్నాయంగా వైద్యులు నిర్ధారించారు. రెండువైపులా ఉన్న బాహ్య ఇలియాక్ నాళాలు కుచించుకుపోయినట్టు సిటీ స్కాన్ ద్వారా నిర్ధారించకుని, మొదట పెరిఫెరల్ బెలూన్‌తో కుచుంచుకు పోయిన నాళాలను వ్యాకోచించే విధంగా చేసి కవాటాన్ని అమర్చారు. రోగిని మూడవ రోజునే హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ చేసారు. శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన అపోలో కార్డియాలజీ వైద్య బృందం డాక్టర్ డికె.బారువాల, డాక్టర్ కె.పాణిగ్రహి, డాక్టర్ చక్రధర్ పేడాడ, డాక్టర్ శశాంక్, డాక్టర్ రవికాంత్, డాక్టర్ జైదీప్‌కుమార్ త్రివేది, కార్డియాక్ అనస్తీషియా బృందాన్ని అపోలో ఆసుపత్రి యాజమాన్యం అభినందించింది.

సాయిరాం కాలనీలో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

ప్రజాశక్తి- పిఎం పాలెం : ఐదో వార్డు సాయిరాం కాలనీలోని అంబేద్కర్ విగ్రహం తల భాగాన్ని ఆదివారం రాత్రి ధ్వంసం చేసిన సంఘటనతో మధురవాడ ప్రాంతంలో పెద్ద ఎత్తున అలజడి రెగింది. ఘటనపై దళితసంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పిఎం పాలెం ఇన్చార్జి సిఐ నారాయణరావు, ఎస్ఐ సునీత సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. స్థానికంగా ఉంటున్న ఇద్దరు యువకులు మద్యం మత్తులో ఈ చర్యలకు పాల్పడి ఉంటారని స్థానికుల సమాచారంతో అనుమానితులను అదుపులోకి తీసుకునిపోలీసులు విచారణ చేపడుతున్నారు. భీమిలి నియోజకవర్గ వైసిపి ఎస్‌సి సెల్ ఇంచార్జ్ సియ్యాద్రి కనకరాజు దళిత సంఘాల నాయకులతో సంఘటనా స్థలానికి చేరుకొని నిరసన చేపట్టారు. సమస్యను ఎమ్మెల్యే ముత్తంశెట్టి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలతో దళిత సంఘాల ఆధ్వర్యంలో ధ్వంసమైన పాత విగ్రహాన్ని తొలగించి అదే స్థానంలో సోమవారం సాయంత్రానికి మరో కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సంఘటనాస్థలిని టిడిపి నేతలతో భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు సంఘటన స్థలానికి చేరుకుని ధ్వంసమైన విగ్రహాన్ని పరిశీలించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

స్వచ్ఛ పక్వాడా ప్రచార రథం ప్రారంభం

ప్రజాశక్తి -ములగాడ : స్వచ్ఛ సర్వేక్షన్ 2023లో విశాఖ నగరాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు జివిఎంసితో కలిసి హెచ్‌పిసిఎల్ కృషి చేస్తుందని జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ అన్నారు. సోమవారం మల్కాపురంలోని హెచ్‌పిసిఎల్ రిఫైనరీలో సంస్థ ఏర్పాటు చేసిన స్వచ్ఛ పక్వాడా ప్రచార రథాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 2014 నుంచి హెచ్‌పిసిఎల్ సహకారం అందిస్తోందన్నారు. ఎనిమిది జోన్లలోప్రచారానికి ఎనిమిది ఆటోలను ఏర్పాటు చేసిందని, వాటిల్లో కళజాతా బృందాలు ప్రచారం చేస్తాయన్నారు. ఇవేకాక ఎఫ్ఎం రేడియోలో ప్రచారం చేస్తున్నట్లు వెల్లడించారు.